

# కొనుగోళ్ల సందడి

- ఈ ఏడాది ముందే చేతికొచ్చిన వేరుశనగ పంట
- అధిక దిగుబడి, ధరతో రైతులు ఖుషి
- క్వింటాకు సరాసరిగా రూ.7వేలకు పైగా పలుకుతున్న ధర
- వనపర్తి మార్కెట్‌కు పక్షం రోజుల్లో 15 వేల క్వింటాళ్లు
- జిల్లాలో 30 వేల ఎకరాల్లో పంట సాగు

వనపర్తి, డిసెంబర్ 10, (నమస్తే తెలంగాణ) : వేరుశనగ ఈఏడాది మార్కెట్‌కు అనుకున్న సమయానికి ముందే వస్తున్నది. సాధారణంగా జనవరిలో వచ్చే వేరుశనగ పంట ఈపాటికే మార్కెట్లలో నిండుకుంటుంది. జిల్లాలో 30,133 ఎకరాల్లో వేరుశనగ పంటను రైతులు సాగు చేసినట్లు వ్యవసాయశాఖ అంచనా ఉంది. ముందుగా ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వేసిన వేరుశనగ పంట చేతికి రావడంతో మార్కెట్ యార్డు కళకళలాడుతున్నది. ఈ ఏడాది వర్షాల ప్రభావం అంతంత మాత్రమే ఉన్నా ప్రాజెక్టుల నీళ్లు గళగళా పారుతుండటంతో ఎటుచూసినా పంటల రాసులు కనబడుతున్నాయి. ఒకవైపు వానాకాలం వరికోతలు నెల రోజులుగా సాగుతున్నది. మరో నెల రోజుల వరకు వరిధాన్యం కేంద్రాలకు వస్తుందని అంచనా వేస్తున్నారు.

### జోరందుకున్న విక్రయాలు..

నెల రోజులు ముందుగానే ప్రారంభమైన వేరుశనగ పంట విక్రయాలు జోరందుకుంటున్నాయి. ఇప్పటి వరకు ఈ పక్షం రోజుల్లోనే దాదాపు 15వేల క్వింటాళ్ల వరకు వేరుశనగ విక్రయాలు జరిగినట్లు మార్కెటింగ్ అధికారులు చెబుతున్నారు. దీన్ని బట్టి వచ్చే జనవరి నుంచి మరింత భారీగా వేరుశనగ పంట విక్రయాలు జరుగుతాయని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం రోజుకు 2వేల క్వింటాళ్ల చొప్పున మార్కెట్‌కు వేరుశనగ పంట వస్తున్నది. ప్రభుత్వ ఎంఎస్‌పీ ప్రకారం క్వింటాకు రూ.6,377 ధర ఉన్నది. అయితే, బహిరంగ మార్కెట్‌లో విక్రయాలను పరిశీలిస్తే ప్రభుత్వ ఎంఎస్‌పీ కంటే దాదాపు రూ.వెయ్యి వరకు అటు, ఇటుగానే విక్రయాలు అవుతున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటా వేరుశనగకు మధ్యస్థ ధర రూ.7వేల పైబడి విక్రయాలు సాగుతున్నాయి. స్థానికంగా ఉండే మిల్లర్లు మాత్రమే టెండర్లలో పాల్గొంటున్నారు. అమ్మకాలు పెరిగితే బయటి ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చే అవకాశం ఉంది. వనపర్తి మార్కెట్ నుంచి ముంబయి, ఢిల్లీ, యూపీ, బీహార్, చెన్నై వంటి రాష్ట్రాలకు వేరుశనగ వెళ్లే అవకాశం ఉంది.

### 30వేల ఎకరాల్లో వేరుశనగ..

జిల్లాలో దాదాపు యాసంగిలో 30,133 ఎకరాల్లో వేరుశనగ సాగు చేసినట్లు వ్యవసాయశాఖ అంచనా ఉన్నది. జిల్లాలోని 14 మండలాల్లో వేరుశనగను రైతులు సాగు చేశారు. కొన్ని మండలాల్లో ముందుగానే వేరుశనగ సాగుచేశారు. వానాకాలం సీజన్‌లో పూర్తిగా వేరుశనగ సాగును మానివేసిన రైతులు, ఈ రెండేండ్లలో ముందస్తుగా వేరుశనగ సాగుకు ప్రాధాన్యతనిస్తున్నారు. గతంలో కేవలం వర్షాధారాలపైనే ఆధారపడి వేరుశనగ సాగు ఉండేది. యాసంగిలో కొంత మాత్రమే ఉన్నప్పటికీ ఎక్కడా కనిపించకపోయేది. గడచిన ఐదేండ్లుగా ఎటుచూసినా రోడ్డు వెంట పచ్చని పైర్లతో కళకళలాడుతున్నాయి. ఇదిలా ఉండగా, వరి, వేరుశనగలకు ధీటుగా ఇటీవలే ఆయిల్‌పాం తోటల పెంపకంపై రైతులకు మక్కువ చూపిస్తున్నారు. అడవి పందు, కోతుల సమస్యలు లేకుండా ఉన్న ఆయిల్‌పాం తోటలకు ప్రభుత్వం 85శాతం సబ్సిడీ ఇస్తున్నందునా అటువైపు కూడా రైతులు అడుగులు వేస్తున్నారు.

### 17 మార్కెట్ యార్డులు.

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 17 వ్యవసాయ మార్కెట్ యార్డులుంటే, ప్రస్తుతం వనపర్తి మార్కెట్‌కు మాత్రమే వేరుశనగ పంట వస్తున్నది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, అచ్చంపేట, బాదేపల్లి, వనపర్తి రోడ్, గద్వాల, వనపర్తి వ్యవసాయ మార్కెట్‌లకు మాత్రమే వేరుశనగ పంట వచ్చే అవకాశం ఉంది. వీటిలో ప్రస్తుతం గద్వాల మార్కెట్‌కు సైతం కొంత మేర వేరుశనగ వస్తున్నది. మిగిలిన ప్రాంతాల్లో మరో పక్షం రోజులు గడిస్తే తప్పా వేరుశనగ వచ్చే అవకాశం లేదు. ఇదిలా ఉండగా, గతంలో గద్వాల మార్కెట్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఉండేది. క్రమంగా అన్ని ప్రాంతాల్లోనూ మార్కెట్ యార్డులు అభివృద్ధి చెందడం, పంటలు పుష్కలంగా పండటంతో మార్పులు వచ్చాయి.

| తేదీ | అధిక ధర | తక్కువ ధర | సరాసరి ధర | క్వింటాళ్లలో |
|---|---|---|---|---|
| 4 | 8,240 | 5,000 | 7,139 | 2,205 |
| 6 | 8,199 | 4,420 | 7,281 | 2,200 |
| 7 | 8,089 | 4,690 | 7,299 | 1,224 |
| 8 | 8,299 | 4,300 | 7,284 | 1,015 |
| 9 | 8,299 | 5,499 | 7,299 | 1,200 |

### ఈసారి పంట బాగా పండింది..



ఈసారి మాకు వేరుశనగ పంట బాగా పండింది. గతేడాది ఐదెకరాల్లో 80 బస్తాలయితే, ఇప్పుడు 146 బస్తాల పంట వచ్చింది. పోయినేడు తెగుళ్లతో నష్టం రాగా, ఇప్పుడు పంట మంచిగ పండింది. అంతా బోరునీళ్లతోనే సాగు చేశా. మాకు కాల్వల నీళ్లు లేవు. ధర కూడా బాగానే ఉంది.

- రాజు, రైతు, రాయినిపల్లి, పాన్‌గల్ మండలం, వనపర్తి జిల్లా

### పురుగు ధాటికి పంట దెబ్బ తిన్నది..



ఈసారి పురుగు పడి సగం పంట దెబ్బతిన్నది. పోయినేడు ఐదెకరాల్లో 250 బస్తాలు పండించగా, ఈసారి 110 బస్తాల వేరుశనగ పంట వచ్చింది. మా ఊర్లో తెగులుతో పంట సరిగా పండలేదు. జూరాల కాల్వ నీళ్లతోనే పంటలు పండుతున్నయి.

- పి.వెంకటయ్య, రైతు, నాగసానిపల్లి, శ్రీరంగాపురం మండలం, వనపర్తి జిల్లా

### సాగునీటితో పుష్కలంగా పంటలు..



15రోజులుగా మార్కెట్‌కు వేరుశనగ పంట వస్తున్నది. జనవరి నుంచి మరింత ఎక్కువగా వేరుశనగ మార్కెట్‌కు వచ్చే అవకాశముంది. ప్రస్తుతం రోజూ వెయ్యి నుంచి 2వేల క్వింటాళ్లు వస్తుండగా, 15రోజుల తర్వాత రోజు 10వేల క్వింటాళ్లు కూడా వచ్చే అవకాశం ఉన్నది. సాగునీరు అనుకూలంగా ఉన్నందునా పంటలు పుష్కలంగా పండుతున్నాయి. ఇతర రాష్ట్రాల వ్యాపారులు కూడా కొనుగోలు చేసే అవకాశమున్నందునా ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది.

- జి.లక్ష్మయ్య, వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి, వనపర్తి

# కోర్కెలు తీర్చే నిత్యానందస్వామి

- మహిమ గల స్వామిగా ప్రసిద్ధి
- కార్తీక అమావాస్య రోజున ఆరాధన
- నేటి నుంచి 64వ ఆరాధనోత్సవాలు
- మూడు రోజులపాటు నిర్వహణకు ఏర్పాట్లు





నిత్యానందస్వామి పాదుకలు

అలంపూర్, డిసెంబర్ 10 : నమ్మిన వారికి కొంగు బంగారమై కోరిన కోర్కేలు తీర్చే మహిమ గల స్వామిగా నిత్యానందస్వామి దశాబ్దాలుగా భక్తులతో ఆరాధించబడుతున్నాడు. క్షేత్రాన్ని దర్శించుకుంటే నిత్యానందం పొందుతారని భక్తుల నమ్మకం. నిత్యానంద స్వామి జీవ సమాధి ఆశ్రమం వద్ద ప్రతి ఏడాది కార్తీక అమావాస్య రోజు ఆరాధనోత్సవాలు నిర్వహిస్తారు. కులమతాలకతీతంగా నిర్వహించే ఈ ఉత్సవాల సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంటుంది. ఈ ఆరాధన ఉత్సవాలకు చుట్టుపక్కల గ్రామాల నుంచే కాకుండా పక్కజిల్లాలు, రాష్ట్రాలు (తమిళనాడు) నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. ఆరాధనోత్సవాలు మూడు రోజులపాటు ఘనంగా నిర్వహించనున్నారు.

### స్వామివారి చరిత్ర..

తమిళనాడు రాష్ట్రం తిరుణల్వేలి జిల్లా కోయిల్‌పట్టి నియోజకవర్గంలోని యళయరసనందల్ గ్రామానికి చెందిన నిత్యానంద స్వామిది ఆధ్యాత్మిక కుటుంబం. రుక్మిణమ్మ, అప్పస్వామి దంపతులకు రెండో కుమారుడుగా ఈయన జన్మించారు. మొదటి నుంచి చదువుపై ఆసక్తి కనబర్చని స్వామి దైవ చింతనతో నిత్యంకాలం గడిపేవారు. రోజువారి క్ర మంలో భాగంగా మధుర మీనాక్షి ఆలయంలో స్వామి ధ్యానిష్టలో నిమగ్నమై ఉండగా, గమనించని పూజారులు ఆలయ గడియ పెట్టి వెళ్లిపోయినట్లు చెబుతారు. ఆరోజు రాత్రే స్వామికి మీనాక్షిదేవి ప్రత్యక్షమై జ్ఞానోదయం కల్గించగా, ప్రాణాయమా వి ద్యను అభ్యసిస్తానని తల్లి రుక్మిణమ్మతో చెబుతాడు. చిన్న వయ స్సులో నీకు తగదని తల్లి వారిస్తుంది. పట్టువీడని నిత్యానం దస్వామి శివ పరమాత్మను కోరుతూ తపస్సు చేశాడు. అనంతరం విమలానందస్వామి వద్ద శిశ్యరికం పొందాడు. మంత్రోపదేశం అనంతరం సన్యాసం స్వీకరించి దేశ పర్యటన కోసం బయలుదేరాడు. కర్నూల్ జిల్లా నల్లమల అడవుల్లో ధనుశ్యాల అనే ప్రదేశంలో స్వామి క్రూరమృగాల మధ్య ఘోర తపస్సు చేసి భగవంతుడి అనుగ్రహం పొందాడు. అలా కొంతకాలం గడిచాక ఉపదేశం చేస్తూ గ్రామాలు సంచరిస్తూ క్రమంగా జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ తాలుకా లింగనవాయి గ్రామం చేరుకున్నాడు. గ్రామస్తులు ఆయనను ఆరాధించటంతో అక్కడే స్థిరపడిపోయాడు. ఆయనకు అక్కడ కొంతమంది శిశ్యరిక బృందం కూడా ఏర్పడింది. క్రమంగా అక్కడ ఆశ్రమం వెలిసింది. ఆశ్రమ వ్యవస్థాపకులు కీ.శే.శివానందస్వామి ఆశ్రమ అభివృద్ధి కోసం కృషి చేశారు. నిత్యానంద స్వామి ప్రత్యక్ష శిశ్యుడైన కీ.శే.సానేవోనే స్వామి ఆశ్రమ అభివృద్ధి కోసం 10ఎకరాల వ్యవసాయ భూమిని దానం చేశారు. శివానంద స్వామి తోటి శిశ్యుల సహకారంతో 1952లో ఆశ్రమ నిర్మాణం చేపట్టారు. ఇదిలా ఉండగా, నిత్యానందస్వామి 1959 నవంబర్ 30వ తేదీన లింగనవాయి ఆశ్రమంలోనే జీవసమాధి అయ్యారు. ప్రముఖ చరిత్రకారుడు కీ.శే.గడియారం రామకృష్ణ శర్మ, దేవి ఉపాసకులు కర్నూల్ సంజీవప్ప, బెక్కెం హరిసింగ్ ఠాకూర్ శిశ్యరికం పొంది నిత్యానందస్వామి జీవిత చరిత్రను రచించినట్లు ఆధారాలు చెబుతున్నాయి.

### ఆశ్రమ అభివృద్ధికి కృషి..

నిత్యానంద స్వామి జీవసమాధి అయినప్పటి నుంచి నేటి వరకు ఆశ్రమం వద్ద ఆరాధనోత్సవాలు ప్రతి ఏడాది నిర్వహిస్తూనే ఉన్నారు. స్వామివారి వద్ద కీ.శే.చంద్రశేఖర్‌రెడ్డి, కీ.శే.రాజశేఖర్‌రెడ్డి, బైరెడ్డి పెద్దశివారెడ్డి, పొడుపు చిన్నారెడ్డి, లక్ష్మన్నగౌడ్ శిశ్యరికం చేశారు. ప్రస్తుతం రామదాసు, రమణగుప్త, స్వామిశెట్టి,పూజారి కురుమూర్తి, రాముడు తదితర గ్రామ పెద్దలు నేటికి ఆశ్రమ అభివృద్ధి సహకరిస్తూనే ఉన్నారు. కార్తీక అమావాస్య సందర్భంగా మంగళవారం నిర్వహించే ఆరాధనోత్సవాలకు ఏర్పాట్లను పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

### ఆధ్యాత్మిక కార్యక్రమాలు..

11వ తేదీన కలశ స్థాపన, దేవతల ఆహ్వానం, లక్ష్మీ గణపతి హోమం, ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు నిర్వ హిస్తారు. 12న ఉదయం 8గంటలకు నవగ్రహోమం, మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ, రుద్రాభిషేకా లు, స్వామివారి పాదుక పూ జ, అలాగే భక్త బృందా లతో సంకీర్తన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

# ఆర్‌ఎన్‌ఆర్ @ రూ.3,319

నవాబ్‌పేట, డిసెంబర్10 : నవాబ్‌పేట మార్కెట్‌యార్డుకు ఆదివారం రైతులు భారీగా ధాన్యాన్ని తీసుకొచ్చారు. గ్రామాల్లో వరికోతలు ఊపందుకోవడం, వరి ధాన్యానికి మంచి ధర లభిస్తుండటంతో రైతులు నేరుగా మార్కెట్ యార్డుకు ధాన్యం తీసుకువచ్చి విక్రయించేందుకు మొగ్గు చూపుతున్నారు. ఈ సీజన్‌లో వరి సన్నరకాలతోపాటు, దొడ్డు రకం ధాన్యానికి సైతం ధర అధికంగా పలకడంతో కొనుగోలు కేంద్రాలకంటే మార్కెట్‌లోనే అధిక ధర లభిస్తుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. గత బుధవారం వాతావరణ పరిస్థితుల కారణంగా ధాన్యానికి టెండర్లు వేయకపోవడంతో ధాన్యం నిల్వలు మార్కెట్‌లో అధికమయ్యాయి. రెండు రోజుల కిందట టెండర్లు వేసిన ధాన్యం లిఫ్ట్ చేయకపోవడంతో ధాన్యం బాగా పేరుకుపోయింది. ఆదివారం ఒక్క రోజే వివిధ గ్రామాల 22వేల వరి ధాన్యం బస్తాలు రావడంతో ధాన్యం మార్కెట్‌లో అన్‌లోడ్ చేయడానికి కూడా ఇబ్బందికరంగా మారింది. చివరికి సాయంత్రం ధాన్యాన్ని అన్‌లోడ్ అధికారులు చొరవ తీసుకొని ధాన్యాన్ని అన్‌లోడ్ చేయించారు. ధాన్యం అధికంగా రావడంతోనే టెండర్లు వేయలేదని మార్కెట్ కార్యదర్శి రమేశ్‌కుమార్ తెలిపారు. గత వారంలో నిర్వహించి టెండర్లలో ఆర్‌ఎన్‌ఆర్ సన్నరకం ధాన్యానికి క్వింటాకు రూ.3,319 అధిక ధర లభించినట్లు తెలిపారు. అలాగే దొడ్డు రకం(1010) ధాన్యానికి క్వింటాకు రూ.3,058 ధర లభించినట్లు ఆయన తెలిపారు. సోమవారం టెండర్లు వేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.




ట్రాక్టర్లలో రైతులు మార్కెట్‌కు తీసుకొచ్చిన ధాన్యం

# నారుకు చీరలే శ్రీరామరక్ష

ఊట్కూర్, డిసెంబర్ 10 : అన్నదాతలకు పంటలు పండించడం సాహసమైతే.. దానికి ముందు పశుపక్షాదులను తట్టుకుని నారు పెంచడం అంతకంటే పెద్ద సాహసం. ఊట్కూర్ మండల కేంద్రం నుంచి సంస్థాపూర్‌కు వెళ్లే రహదారి పక్కనే ఉన్న పొలంలో ఓ రైతు వరి నారు పెంచుతున్నాడు. వరినారు పశువుల బారిన పడకుండ విభిన్నంగా ఆలోచించాడు. ఎటువంటి ఖర్చు చేయకుండా ఇంట్లో పాత చీరలను తెచ్చి వరి నారుకు రక్షణగా ఏర్పాటు చేశాడు. ఆ నారు పెరిగి పెద్దదయ్యింది. మరికొద్ది రోజుల్లో వరి నాట్లు వేసేందుకు సిద్ధంగా ఉన్నది. ఈ దృశ్యాన్ని 'నమస్తే తెలంగాణ' క్లిక్ మనిపించింది.





వరాహాంజనేయ స్వామి మూల విగ్రహం

# ఆంజనేయా.. కరుణించవయ్యా!

- వరాహాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలకు వేళాయే..
- రేపటి నుంచి కొత్తపల్లిలో వేడుకలకు ఏర్పాట్లు
- 12న ప్రభోత్సవం, 13న రథోత్సవం
- 14న అంతర్రాష్ట్ర న్యూ కేటగిరీ బండలాగుడు, 15న ఓపెన్ కబడ్డీ పోటీలు

అయిజ, డిసెంబర్ 10 : కోరిన కోర్కెలు తీర్చే వరాహాంజనేయస్వామిని భక్తులు తమ ఇంటి దైవంగా నిత్యం కొలుస్తుంటారు. ప్రతి ఏటా కార్తీక అమావాస్య నుంచి నాలుగు రోజులపాటు బ్రహ్మోత్సవాలను నిర్వహించడం గ్రామ ఆచారంగా వస్తోంది. బ్రహ్మోత్సవాలకు తెలంగాణ, కర్ణాటక, ఏపీ రాష్ట్రాలకు చెందిన భక్తులు తరలి వచ్చి వరాహాంజనేయస్వామికి మొక్కులు చెల్లించుకోనున్నారు. మంగళవారం నుంచి ప్రారంభం కానున్న బ్రహ్మోత్సవాలకు ఆలయ కమిటీ ఏర్పాట్లను చేసింది. రాత్రి 8గంటలకు నందికోళ్ల సేవ, 9గంటలకు ప్రభోత్సవం, బుధవారం రాత్రి 7గంటలకు గంగపూజ, 9 గంటలకు పంచామృతాభిషేకం, రాత్రి 11గంటలకు వరాహాంజనేయ స్వామి రథోత్సవం నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాలకు ఆలయ కమిటీ సకల ఏర్పాట్లను చేసింది. బ్రహ్మోత్సవాల వేళ ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించనున్నారు. భక్తులకు కావాల్సిన సదుపాయాలను సర్పంచ్, ఎంపీటీసీ, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో కల్పిస్తున్నారు.

### 14న అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలు ..

కొత్తపల్లి వరాహాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఈ నెల 14వ తేదీన అంతర్రాష్ట్ర న్యూ కేటగిరి విభాగం బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు. పోటీలకు తెలంగాణ, ఏపీ, కర్ణాటక రాష్ట్రాల నుంచి వృషభరాజములు తరలిరానున్నాయి. బండలాగుడు పోటీల్లో గెలుపొందిన వృషభరాజముల విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. మొదటి బహుమతి 40,116, రెండో బహుమతి 30,116, మూడో బహుమతి 20,116, నాలుగో బహుమతి 10,116లు అందజేయనున్నారు. 15న అంతర్రాష్ట్ర ఓపెన్ కబడ్డీ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ, గ్రామ పెద్దలు పేర్కొన్నారు. కబడ్డీ పోటీల్లో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి రూ.30,116, రెండో బహుమతి రూ. 20,116, మూడో బహుమతి రూ. 10,116, నాల్గో బహుమతి 5,116 నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. స్లోబైక్ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మొదటి బహుమతి రూ. 3,116, రెండో బహుమతి రూ. 2,116లు అందజేయనున్నారు.

# వరి కొయ్యలు.. కాలిస్తే అనర్థాలు

- రైతులకు అవగాహన లేమి..
- కలియదున్నితేనే లాభం
- అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు



**వరిపంటను హార్వెస్టింగ్ చేసే సమయంలో పైకి కోయడంతో కొయ్యలు పెద్దగా మిగిలి పోతున్నాయి. అవసరమున్న రైతులు కొంత గడ్డిని కోసి తీసుకెళ్తున్నారు. మిగిలిన దానిని అక్కడే వదిలేస్తున్నారు. మళ్లీ దుక్కి దున్నే సమయంలో నాగళ్లకు అడ్డుగా వస్తున్నాయని రైతులు వరికొయ్యలతోపాటు గడ్డిని కూడా కాలబెడుతున్నారు. దీంతో అధిక నష్టాలు వచ్చే అవకాశమున్నదని, వరి కొయ్యలను తగులబెట్టొద్దని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.**

- న్యూస్ నెట్‌వర్క్, డిసెంబర్ 10

వరి కొయ్యలను కాలిస్తే పర్యావరణ కాలుష్యం ఏర్పడడంతోపాటు పంటలకు మేలు చేసే సూక్ష్మజీవులు నశిస్తున్నాయి. సారవంతమైన భూమి దెబ్బతింటున్నది. రైతులు చిన్నపాటి జాగ్రత్తలు తీసుకుంటే వరి కొయ్యల మిగులు అవశేషాలతో సిరులు సంపాదించవచ్చని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. వరి కోత అనంతరం ఉండే గడ్డిని పశువులకు వాడడం లేదా కంపోస్టుగా మార్చుకోవాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

### కొయ్యలను కాల్చడంతో అనర్థాలు..

పొలంలో కొయ్యలను కాల్చడం అత్యంత ప్రమాదకర స్థాయికి చేరుకున్నదని శాస్త్రవేత్తలు, సామాజికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతులు అవగాహన లేమితో పంటకు ఎంతో మేలు చేసే కొయ్యలను భూమిలో కలియదున్నకుండా కాల్చివేసి భవిష్యత్ పంటలను నాశనం చేస్తున్నారని, వాతావరణాన్ని తీవ్రంగా కలుషితం చేస్తున్నారని చెబుతున్నారు. కొయ్యలను కాల్చివేసే క్రమంలో భూమి గట్టిపడుతున్నదని, పొలాన్ని కలియదున్నడం వీలుకాదని పేర్కొంటున్నారు. కొయ్యలను కాల్చివేయడంతో భూమిలో ఉన్న సూక్ష్మజీవులు, వానపాములు నాశనమవుతున్నాయని, దీంతో భూమి గుల్లగా మారే పరిస్థితి ఉందని చెబుతున్నారు. నాట్లు వేసిన వేర్లకు సరిగ్గా పోషకాలు చేరవని, పైరు పెరగదని వివరిస్తున్నారు. రైతులు ఎక్కువగా యూరియాను వినియోగించాల్సి వస్తున్నదని, కానీ దాన్ని స్వీకరించి వేర్లకు అందించే సూక్ష్మజీవులు అప్పటికే అంతరించిపోవడంతో ప్రయోజనం లేకుండా పోతున్నదని పేర్కొంటున్నారు.ఇదే సమయంలో యూరియాను అతిగా వాడడంతో భూమిలోకి చేరి భూగర్భ జలం విషతుల్యమవుతుందని, వాతావరణంలో అనేక మార్పులు కలుగుతాయని చెబుతున్నారు. కార్బన్ డై ఆక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్, హైడ్రోకార్బన్ గాలిలో కలిసి వాతావరణం, జీవకోటిపైన తీవ్ర ప్రభావం చూపుతాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.

### కలియదున్నితేనే లాభం..

పంట కోసిన వెంటనే వరి కొయ్యలను కాల్చకుండా పొలంలోనే కలియదున్నాలి. దీంతో కొయ్యలు మట్టితో కప్పబడి కుళ్లే ప్రక్రియ ప్రారంభమవుతుంది. తర్వాత సేంద్రియ ఎరువుగా మారుతుంది. వరి కొయ్యలను కలియదున్నడం, కుప్ప చేయడంతో నేలల్లో పగుళ్లు రాకపోవడం, తేమ ఆవిరి కావడం తగ్గి భూమి కోతకు గురికాకుండా ఉంటుంది. కొయ్యలను కలియదున్ని వెంటనే కుళ్లిపోయేలా పొటాషియం చల్లితే సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుంది. తదుపరి పంటకు పోషకాలు విపరీతంగా పెరుగుతాయి.